క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం విద్యుత్ సబ్ స్టేషనల్లోని 33/11 కేవీ ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులను చేపట్టనున్న దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా వీఎస్ఈజెడ్ క్యాంపస్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

తిరుమల బాలాజీకి భక్తుడి విరాళం



దివ్యక్షేత్రం ప్రతినిధులకు చెక్కు అందిస్తున్న దాత

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో కొలువైన శ్రీ తిరుమల బాలాజీకి వెండి కర్ణ పత్రాల నిమిత్తం వల్లభనేని వీరరాఘవయ్య చౌదరి అనే భక్తుడు రూ.90 వేలు విరాళం అందజేశారు. స్వామిని శనివారం దర్శించుకున్న ఆయన ఆ విరాళాన్ని చెక్కు రూపంలో దివ్య క్షేత్రం ప్రతినిధులకు అందజేశారు.

మార్కెటింగ్ నూతన విభాగాధిపతికి అభినందనలు



మార్కెటింగ్ హెడ్ రథ్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ విభాగాధిపతి పి.కె.రథ్‌ను స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు అభినందించారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, నాయకులు పిట్టారెడ్డి, ఎన్నేటి రమణ, మార్టుపూడి పరదేశి, డి.పుల్లారావు, బి.వి.రామయ్య, ఎ.గోవిందరావు, బొడ్డ గోవింద, బి.శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీ కార్లకు టెండర్ల ప్రకటనపై హర్షం

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో దివ్యాంగులు, వృద్ధులకు అనువుగా ఉండేలా బ్యాటరీ కార్లకు రైల్వే అధికారులు టెండర్లు పిలవడంపై దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. దువ్వాడ రైల్వేస్టేషన్ ఎన్టీపీసీ ట్రాక్ క్రాసింగ్ వంతెన నుంచి ప్లాట్‌ఫాంకు చేరుకోవడానికి దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు అవస్థలు పడుతున్నారు. అలాగే సాధారణ ప్రయాణికులు కూడా లగేజీలతో పరుగులు తీయాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారమయ్యేలా బ్యాటరీ కార్లు ఏర్పాటు చేయాలని యూజర్స్ అసోసియేషన్ కొంతకాలంగా విజ్ఞప్తి చేస్తోంది. ఈ మేరకు అధికారులు స్పందించి టెండర్లు పిలవడంపై అసోసియేషన్ హర్షం ప్రకటించింది.

సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన



స్థానికులకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ భాస్కరరావు

అక్కిరెడ్డిపాలెం: సీసీ కెమెరాలతో నేరాలను అరికట్టవచ్చని గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐ ఎల్.భాస్కరరావు అన్నారు. వ్యాపార సముదాయాలు, అపార్ట్‌మెంట్ల వద్ద సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తూ స్థానికులకు డ్రైవర్స్ కాలనీలోని ద్రోణంరాజు కల్యాణ మండపంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వ్యాపార సముదాయాల యజమానులు, నివాసితులు ఇంటి ముందు, షాపుల ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధారకొండ.. భక్తిభావమే మది నిండా..

చుట్టూ ఎత్తయిన కొండలు.. ఎటు చూసినా పరుచుకున్న పచ్చదనం.. కొండల మధ్య నుంచి, పచ్చని చెట్లను తాకుతూ సన్నగా.. గలగల పారుతూ వస్తున్న ఓ ధార ఇక్కడి శివలింగాన్ని అభిషేకిస్తూ దర్శనమిస్తుంది. ఈ ధార ఎక్కడ పుట్టింది.. ఎక్కడి నుంచి వస్తుంది అనేది తెలియదు. దానిని తెలుసుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని చెబుతారు. ఏదేమైనా గంగాధరుడిని అభిషేకించేందుకు గంగమ్మే స్వయంగా వస్తోందంటూ భక్తులు తన్మయులవుతున్నారు. ప్రకృతి గీసిన చిత్రంలా.. గంగవరం గ్రామంలో ఉన్న ఈ ధారకొండ అటు భక్తులను, ఇటు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

- శివలింగంపై జాలువారుతున్న గంగమ్మ
- కోర్కెలు తీర్చే ధారస్వామిగా పిలుచుకుంటున్న భక్తులు
- ప్రతీ శనివారం విశేష పూజలు



కనువిందు చేసే ధారకొండ వద్ద అందాలు



శివలింగంపై పడుతున్న ధార



ధార స్వామికి నైవేద్యం వండుతున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధిలో గంగవరం గ్రామాన్ని ఆనుకుని, యారాడ వెళ్లే ప్రధాన రహదారి పక్కన భార్గవ్ ఆర్ట్స్ స్టూడియో లోపల ఉన్న ధార కొండ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కోర్కెలు తీర్చే ధారస్వామిగా ఇక్కడి ప్రజలు పూజిస్తున్నారు. 40 ఏళ్ల క్రితం ఇక్కడ ధార స్వామి కొండ సహజ సిద్ధంగా ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. స్వామిని దర్శించుకుని, పూజలు చేసి, కోర్కెలు కోరుకుంటే అవి వెంటనే నెరవేరుతాయని భక్తుల నమ్మిక. వివాహం కాని వారికి వివాహం జరిగిందని, సంతానం లేని వారికి పిల్లలు పుట్టారని చెబుతారు. కోర్కెలు నెరవేరిన వెంటనే వచ్చి ఇక్కడ స్వామివారికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది.

కలగూర.. పులగం నివేదన

ధారకొండకు ప్రతి శనివారం భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. ఈ ప్రాంతం విశిష్టత తెలుసుకున్న వారు అక్కడి శివలింగాన్ని, ధారస్వామిని దర్శించకోవడానికి తరలి వస్తుండడంతో ఆ ప్రాంతం భక్తజనంతో కోలాహలంగా కనిపిస్తుంది. గంగవరం గ్రామానికి చెందిన వారు తమ కుటుంబ సభ్యులతో వచ్చి, పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అలాగే ధారస్వామికి ఇష్టమైన అన్ని రకాల కూరగాయలతో కలగూర అక్కడే తయారు చేస్తారు. అన్నం, పప్పుతో కలిపి పులగం వండి వారుస్తారు. దానినే స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి, ఆపై కుటుంబ సభ్యులంతా ఆరగిస్తారు. అక్కడే రోజంతా ఉల్లాసంగా గడుపుతారు.

ఎంతో మహిమ గల స్వామి



ధార స్వామి ఎంతో మహిమ ఉన్న స్వామి. 40ఏళ్లగా స్వామి సేవలో తరిస్తున్నాను. భక్తులకు నా వంతు సేవ చేస్తున్నాను. ఇక్కడ స్వామి వారు వెలసిన నాటి నుంచి ప్రతీ శనివారం ఇక్కడ పూజలు చేస్తున్నాం. ఏ కష్టం వచ్చినా స్వామినే నమ్ముకుని ఉన్నాం. ఆయనే అన్ని సమస్యలకు దారి చూపిస్తారు. ఎంతో మంది స్వామిని దర్శించుకునేందుకు వస్తారు. కోర్కెలు నెరవేరాక మళ్లీ వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

– పల్లేటి గురయ్య, పల్లేటి రాజమ్మ గంగవరం

చిన్నప్పటి నుంచి వస్తున్నాం



మా తాతల కాలం నుంచి స్వామి దర్శనానికి వస్తున్నాం. నా చిన్నతనం నుంచి మా తాతయ్య నన్ను ఇక్కడికి తీసుకువచ్చేవారు. ఇక్కడికి వస్తే మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఎంతో మహిమ గల దేముడు ధార స్వామి.

– కొవిరి దేవి, ధార వీధి

స్వామిని దర్శించుకుంటే చాలు



ఎన్ని బాధలు ఉన్నా స్వామిని దర్శించుకుంటే చాలు ప్రశాంతంగా ఉంటుంది. ప్రతీ శనివారం ఇక్కడికి వచ్చి పూజలు చేస్తుంటాం. నైవేద్యం ఇక్కడే వండి స్వామికి సమర్పిస్తాం. ఇక్కడికి రావడం మాకు పండగలా ఉంటుంది.

– గొందేశి గుణసుందరి

క్యాంపస్ డ్రైవ్‌లో 151 మందికి కొలువులు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ బహుళ జాతి సంస్థ యాక్సెంచెర్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 151 మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించాయి. కంపెనీ విద్యార్థులకు పలు దశల్లో పరీక్షలు నిర్వహించగా ముగ్గురు ఏడు లక్షల వార్షిక వేతనంతో, 148 మంది రూ.4.50లక్షల వేతనంతో ఎంపికైనట్టు సంస్థ సీఈవో శ్రీకాంత్, రెక్టార్ వి.మధుసూదనరావు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. వెబెక్స్ ద్వారా సంస్థ చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు కృష్ణదేవరాయలు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ బోడే ప్రసాద్ పాల్గొన్నారు.

త్వరలోనే మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్ ఏర్పాటు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ(వీపీఏ) 90వ ఆవిర్భావ దిన వేడుకలు శనివారం పోర్ట్ వ్యాపార భాగస్వాములు, ఉద్యోగుల మధ్య పోర్ట్ గెస్ట్‌హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ పోర్ట్ వ్యాపార భాగస్వాముల సలహాలతో త్వరలోనే మారిటైం హెరిటేజ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని సందర్శనకు నగర పౌరులకు కూడా అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ కాంప్లెక్స్‌లో 90 ఏళ్ల కాలంలో పోర్ట్‌లో వినియోగించిన వస్తువులు, పురాతన వస్తువులతోపాటు 90 వసంతాల పోర్ట్ ప్రయాణాన్ని వివరించే ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఆర్ కార్డు ద్వారా స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం

బాధితుడి ఫిర్యాదు

ఉక్కునగరం: నకిలీ ఆర్ కార్డు ద్వారా నిర్వాసిత కోటాలో స్టీల్‌ప్లాంట్‌లో చేరిన పరదేశి నాయుడిపై స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని బాధితుడు ఎల్లేటి దేముళ్లు (ఆర్ కార్డుదారు ఎల్లేటి పెంటమ్మ కుమారుడు) కోరారు. ఈ మేరకు ఆయన శనివారం స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో టౌన్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న గండేపల్లి పరదేశి నాయుడు 'ఎల్లేటి పెంటమ్మ కూతురి కుమారుడి(మనవడి)ని' అని తెలిపి, మోసంతో ఆర్ కార్డును మార్చుకుని టౌన్‌ప్లాంట్‌లో ఉద్యోగంలో చేరినట్లు తెలిపారు. నకిలీ ఆర్ కార్డుతో తమ కుటుంబాన్ని మోసం చేసిన పరదేశి నాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎండీకి, డైరెక్టర్ పర్సనల్‌కు, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు.

జగన్ మళ్లీ సీఎం కావడం ప్రజల అభీష్టం

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



శిక్షణ కార్యక్రమానికి హాజరైన 1,3,4 క్లస్టర్ల గృహ సారథులు, కన్వీనర్లు, నాయకులు



టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడి

పెదగంట్యాడ: రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్, ఏపీ సర్వతోముఖాభివృద్ధి కోసం జగన్‌ను మళ్లీ సీఎం సీట్లో కూర్చోబెట్టాలనే తలంపుతో ప్రజలు ఉన్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో క్లస్టర్ 1,3,4 పరిధిలోని పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, గృహ సారథులు, కార్యకర్తలకు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షులు ధర్మాల శ్రీను, ఎండీ గౌస్, బొడ్డ గోవింద్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కులుకూరి మంగరాజు, రామచంద్రరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తిని మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గృహ సారథులు.. కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 175కి 175 స్థానాలు సాధించే దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు తిప్పల దేవన్‌రెడ్డి, రోజారాణి, కోమటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహ పాత్రుడు, రాజాన రామారావు, ఇల్లపు వరలక్ష్మి, నాయకులు దొడ్డి రమణ, గుడివాడ లతీష్, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి శంకరనారాయణ, ఇల్లపు ప్రసాద్ పాల్గొన్నారు.

అగనంపూడి క్లస్టర్‌లో..

అగనంపూడి: జీవీఎంసీ 79, 85, 86, 87,88 వార్డులకు సంబంధించి 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' శిక్షణ కార్యక్రమాన్ని అగనంపూడిలోని జీవీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి ఎందుకు ఎన్నుకోవాలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. అన్ని వర్గాలకు అందుతున్న పథకాలు, వాటి ఫలాలు వివరించాలన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి వ్యత్యాసాలు వివరించాలన్నారు. వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, వార్డుల ఇన్‌చార్జ్‌లు కోమటి శ్రీనివాసరావు, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, గంధ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, జేసీఎస్ క్లస్టర్ కో-ఆర్డినేటర్లు ఇల్లపు ప్రసాద్, వాడపల్లి రామచంద్రరాజు, పార్టీ ముఖ్య నాయకులు గుర్రం శ్రీను, మామిడి శ్రీను, సాలాపు అచ్చిబాబు, కొలిపాక అప్పారావు, బలిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.



అగనంపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

అక్కిరెడ్డిపాలెం: విధులు ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న వ్యక్తిని బస్సు ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన ఆయన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో దుర్మరణం చెందాడు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివి.. పప్పు సాంబమూర్తి (65) ఆటోనగర్‌లోని ఓ కంపెనీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని, పాతగాజువాకలోని లక్ష్మీకాంత్ థియేటర్ వద్ద గల శంకర్‌నగర్‌లో తన నివాసానికి సైకిల్‌పై బయల్దేరాడు. చట్టివానిపాలెం 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న ఫార్మాసిటీ బస్ ఢీ కొనడంతో తలకు గాయమైంది. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని షీలానగర్ కిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

రూ.80 లక్షలతో రోడ్లు, కాల్వల నిర్మాణం

64వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



యాతపాలెంలో రోడ్లు, కాల్వలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: నియోజకవర్గంలోని అన్ని వార్డులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు యాతపాలెం, వెంకన్నపాలెం, ఉప్పర కాలనీ, గంగవరం ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ క్లస్టర్-1 మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. వార్డులో మొత్తం రూ.80 లక్షలతో రోడ్లు, కాల్వలు నిర్మిస్తున్నామని తెలిపారు. యాతపాలెంలో రూ.20 లక్షలతో రోడ్లు, కాల్వలు, వెంకన్నపాలెంలో రూ.40 లక్షలతో కాల్వలు, ఉప్పర కాలనీలో రూ.10 లక్షలతో రోడ్లు, గంగవరంలో రూ.10 లక్షలతో కాల్వలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే వార్డుల్లో సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనపై ప్రజల్లో పూర్తి సంతృప్తిగా ఉన్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంపంగి పార్వతి, అన్నవరం, తిప్పల గోపీ, అప్పల స్వామి, ధర్మాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వం దిగి వచ్చేవరకూ పోరాటం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అన్ని పరిశ్రమల వద్ద దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున జరుగుతున్న నిరసనలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 968వ రోజు, పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. అంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలోని వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో ఈ నెల 15 నుంచి 24 వరకు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్సవాల కరపత్రాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేసారపు సతీష్, మొగలపల్లి త్రిమూర్తులు, కొల్లా అప్పలరాజు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి తదితరులు పాల్గొన్నారు.

సేవలతో గుర్తింపు



సత్యనారాయణను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ విశాఖ చైర్మన్ మోటూరి రమణ అన్నారు. గురు స్పందన ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్న బలిరెడ్డి సత్యనారాయణను అగనంపూడి పెదమడకకు చెందిన అఖిలపక్షాల నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగనంపూడి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటున్న సత్యనారాయణను అవార్డుతో సత్కరించడం సముచితమన్నారు. కార్యక్రమంలో విందుల వరహాలు, వంకర రాము, మడుగల నరసింగరావు, విందుల నారాయణరావు, ఎం.శ్రీను, ఎం.రాజు, ఈశ్వరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

భానోజీతోటలో పట్టపగలే చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

పెదగంట్యాడ: మండలంలోని భానోజీతోట ఏరియాలో పట్టపగలే దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ చేశారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ క్రైం ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 65వ వార్డు భానోజీతోట ఏరియాలో పెట్రోల్ బంక్ వెనుక షేక్ హుస్సేన్ కుటుంబంతో కలసి నివాసం ఉంటున్నారు. తల్లికి డయాలసిస్ చేయాల్సి ఉండడంతో హుస్సేన్ ఈ నెల 5న కేజీహెచ్‌కు వెళ్లారు. ఈ నెల 6న ఉదయం 6 గంటల సమయంలో హుస్సేన్ తండ్రి విధులకు వెళ్లిపోయారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపు తాళం పగలగొట్టి కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా బీరువా విరగ్గొట్టి, అందులో సామగ్రి చిందరవందరగా ఉన్నాయి. బీరువాలో ఉంచిన ఐదు తులాల బంగారం, 30 తులాల వెండి కనిపించకపోవడంతో ఆయన వెంటనే కుమారుడు హుస్సేన్‌కు సమాచారం అందించారు. శనివారం ఉదయం హుస్సేన్ న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం సాయంతో వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూలో సందడి



వన్యప్రాణుల వేషధారణలో చిన్నారులు



వన్యప్రాణి వేషధారణలో అలంకరించిన చిన్నారితో తల్లిదండ్రులు

వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా ఇందిరాగాంధీ జూ పార్కు సందడిగా మారింది. ఈ నెల 2న ఈ వారోత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. పిల్లలు, పెద్దలకు వన్యప్రాణులకు సంబంధించిన అంశాలపై పోటీలు జరిపారు. ఇందులో భాగంగా శనివారం పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. దీంతో చిన్నారులను వివిధ వన్యప్రాణుల వేషధారణ అలరించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ వన్యప్రాణి వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం జూలో మారథాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. –ఆరిలోవ



ఓ బాలుడు

సందడిగా అంతరిక్ష వేడుకలు



ఇస్రో ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ప్రపంచ అంతరిక్ష వేడుకలకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది విద్యార్థులు తరలివచ్చారు. మూడో రోజైన శనివారం ఇస్రో శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలో 1,450, వ్యాసరచనలో 985, పోస్టర్ ప్రజెంటేషన్‌లో 310, చిత్రలేఖనంలో 1,860 మంది కలిపి మొత్తం 4,605 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాకెట్ ప్రయోగాలు, అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి శాస్త్రవేత్తలు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు, షార్ ఆర్గనైజింగ్ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న పర్యవేక్షించారు. అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం జరగనుంది. ఈ ముగింపు కార్యక్రమానికి డీఆర్‌డీవో నేవెల్స్ సిస్టమ్స్ మెటీరియల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ విజయనగరం వీసీ కె.వెంకట సుబ్బయ్య, ఇస్రో చీఫ్ జనరల్ మేనేజర్ పి.వెంకటరెడ్డి తదితరులు హాజరుకానున్నారు.